సాక్షి
రంగారెడ్డి
గురువారం । 8 । మే । 2025



అడుగుకో గుంత!

గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. పెద్ద గుంతలు పడి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 10లో▸



భూ భారతిలోనైనా..

కంప్యూటర్ ఆపరేటర్ తప్పిదం కారణంగా తన భూమి మరో వ్యక్తి పేరిట నమోదైందని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. 10లో▸



ఇరువర్గాల ఘర్షణ

యాచారం మండల పరిధిలోని మీసాలతండాలో భూ తగాదా విషయమై రెండు కుటుంబాల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. 10లో▸

న్యూస్‌రీల్

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.బాలకృష్ణ అన్నారు. మున్సిపల్ పరిధిలోని మంగళ్‌పల్లిలో అనుమతులు లేకుండా చేపడుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలను బుధవారం అధికారులు గుర్తించారు. ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తీసుకొని నాలుగు ఐదు అంతస్తులు వేసి మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారని సిబ్బందితో కలిసి కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

మేమున్నాం.. ధైర్యంగా ఉండండి

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



రాయల్ కాలనీలో నిర్వహించిన కవాతులో పాల్గొన్న డీసీపీ సునీతారెడ్డి తదితరులు

పహాడీషరీఫ్: భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో సున్నితమైన బాలాపూర్, పహాడీషరీఫ్ ఠాణాల పరిధిలో పోలీసులు బుధవారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి పర్యవేక్షణలో కేంద్ర బలగాలతో కవాతు చేస్తూ స్థానిక ప్రజల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేశ్ చౌక్ నుంచి మొదలైన కవాతు బాలాగార్డెన్, రాయల్ కాలనీ, ఫాతిమా మజీద్ మీదుగా గుర్రం చెరువు వరకు కొనసాగింది. పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో చార్మినార్ మజీద్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ వై జంక్షన్, జల్‌పల్లి కమాన్ మీదుగా షాహిన్‌నగర్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం డివిజన్ల ఏసీపీలు పి.లక్ష్మీకాంత రెడ్డి, రాజు, బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు ఎం.సుధాకర్, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐటీ ఉద్యోగి దుర్మరణం

మాదాపూర్: బైకుపై అతి వేగంగా వెళ్తూ..అదుపుతప్పి వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఓ ఐటీ దుర్మరణం పాలయ్యాడు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్ జిల్లా పరకాలకు చెందిన మోకిడి దీపక్ (29) మాదాపూర్‌లోని ఓ కంపెనీలో ఐటీ ఉద్యోగిగా పనిచేస్తూ మల్లంపేట్ కేపీఆర్ వ్యాలీలో నివాసముంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున రెండు గంటలకు దీపక్ బైకుపై పర్వత్‌నగర్ సిగ్నల్ వైపు నుంచి హైటెక్ సిటీ వైపు వెళ్తుండగా..అదే సమయంలో హైటెక్‌సిటీ నుంచి వస్తున్న వాటర్ ట్యాంకర్ వాహనం జంక్షన్ వద్ద టర్నింగ్ తీసుకుంటుండగా..దీపక్ బైకు వేగంగా ఢీకొట్టింది. తల, శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘ఆపరేషన్ సిందూర్’ సంబరాలు



ఆమనగల్లు: ఆర్మీకి సంఘీభావంగా బీజేపీ నాయకుల ర్యాలీ

పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో భారత సైన్యం చేపట్టిన ప్రతి చర్యపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జిల్లాలోని పలు చోట్ల బీజేపీ నాయకులు జాతీయ పతాకాలతో ర్యాలీలు చేపట్టారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినదించారు.



హుడాకాంప్లెక్స్: పాకిస్తాన్ జెండాలను దహనం చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు



ఈతలో శిక్షణ ఇస్తున్న కోచ్



బాస్కెట్‌బాల్‌లో బాలికలకు తర్ఫీదు

ఆడేద్దాం.. నేర్చేద్దాం

సరూర్‌నగర్‌లో సమ్మర్ క్యాంపులు

- ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ
- చిన్నారులతో సందడిగా స్టేడియం



స్కేటింగ్ శిక్షణలో చిన్నారులు

హుడాకాంప్లెక్స్: పిల్లలకు వార్షిక పరీక్షలు ముగియడంతో తల్లిదండ్రులు ప్రత్యామ్నాయ అంశాలపై దృష్టి సారించారు.నిత్యం సెల్‌ఫోన్లు, టీవీ, కంప్యూటర్ స్క్రీన్లకు అతుక్కుపోతున్న పిల్లల్లో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు పలు క్రీడాంశాల్లో శిక్షణ ఇప్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే పలువురు చిన్నారులు సరూర్‌నగర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్టేడియం ఔత్సాహిక క్రీడాకారులు, వారి వెంట వచ్చిన తల్లిదండ్రులతో కిటకిటలాడుతోంది.


చేపలా ఈదొచ్చు..

వేసవి సెలవుల్లో పిల్లలకు ఈత నేర్పించాలని భావించే తల్లిదండ్రులకు సరూర్‌నగర్ స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్ సిద్ధంగా ఉంది. ప్రతి రోజూ మూడు బ్యాచ్‌ల్లో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. చిన్నారుల వయసు, నైపుణ్యం ఆధారంగా బ్యాచులను ఎంపిక చేస్తున్నారు. పురుషులతో పాటు మహిళలకు ప్రత్యేక సమయం కేటాయించారు. ఒక్కో బ్యాచ్‌లో 80 మంది చొప్పున స్విమ్మింగ్ చేసే సదుపాయం ఉంది. శిక్షణలో భాగంగా 25 రోజులకు రూ.1,500 చార్జ్ చేస్తున్నారు. స్విమ్మింగ్ డ్రెస్, క్యాప్‌లను పిల్లలే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. స్విమ్మింగ్ పూల్‌లోని నీటిని ఎప్పటికప్పుడు తొలగించి, కొత్తనీటితో పూల్‌ను నింపుతున్నారు. చర్మ సంబంధిత సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

స్కేటింగ్ చేయొచ్చు.. ఫుట్‌బాల్ ఆడొచ్చు

చదువు పేరుతో రోజంతా తరగతి గదుల్లో బందీగా మారిన చిన్నారులకు వేసవి శిబిరాల్లో భాగంగా స్కేటింగ్, వాలీబాల్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, క్రికెట్, అథ్లెటిక్స్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆరేళ్లు నిండిన చిన్నారులకు స్కేటింగ్, జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో 50 నుంచి వంద మంది వరకు శిక్షణ పొందే అవకాశం ఉంది. సరదాగా నేర్చుకునే అంశాల్లో ఏడాదంతా శిక్షణ పొందొచ్చు. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొని విజయపతాకం ఎగరేయొచ్చు.

సద్వినియోగం చేసుకోండి



ఆటలతో శారీరకంగానే కాకుండా మానసిక ఉల్లాసం పొందొచ్చు. స్టేడియంలో నిష్ణాతులైన కోచ్‌లు ఉన్నారు. 12 అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. క్రీడల్లో శిక్షణతో పాటు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందిస్తున్నాం. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 10 వరకు ఆయా విభాగాల్లో అడ్మిషన్లు స్వీకరిస్తున్నాం. సమ్మర్ క్యాంపుల్లో భాగంగా 25 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నాం.

– వెంకటేశ్వర్‌రావు, జిల్లా క్రీడలశాఖ అధికారి

దేశ రక్షణలో కేంద్రానికి అండగా ఉంటాం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నందిగామ: దేశ సమగ్రత, రక్షణ కోసం కేంద్రం తీసుకోబోయే యుద్ధ సమరానికి తామంతా అండగా ఉంటామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మండల పరిధిలోని నాట్కో పరిశ్రమ, నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన పలు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, మేకగూడలో నిర్మించిన పంచాయతీ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో రాజకీయాల పరంగా, సిద్ధాంతాల పరంగా భిన్నాభిప్రాయాలు కలిగి ఉన్నా, దేశ సమగ్రత కోసం భారత ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇదే స్పష్టంచేశారన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా పూర్తి చేసిన భారతఆర్మీని కొనియాడారు. అంతకుముందు తాటిగడ్డతండా, సంఘీగూడ, నందిగామలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలు, మేకగూడలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. చాకలిదానిగుట్టతండా మాజీ సర్పంచ్ రాజునాయక్ సొంత ఖర్చులతో నిర్మించిన బస్ షెల్టర్‌ను, చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, నాట్కో ఫార్మా ట్రస్ట్ డైరెక్టర్ ప్రసాద్, వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, డీఈఓ సుశీందర్ రావు, ఎంపీడీఓ సుమతి, తహసీల్దార్ రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

విద్య, వైద్యరంగాల అభివృద్ధే లక్ష్యం

కొత్తూరు: ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కొత్తూరు పట్టణంలో నాట్కోట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ.3 కోట్లతో నిర్మించిన ఉన్నత పాఠశాల భవనాన్ని బుధవారం ఆయన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అప్పుల్లో కూరుకుపోయిందని అన్నారు. అయినప్పటికీ పరిస్థితులను అధిగమిస్తూ.. సంపద సృష్టిస్తూ రాష్ట్రంలో అన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కొంత ఆలస్యమైనప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఏడాదిన్నరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక విపక్షాలు ఆరోపణలు చేస్తున్నట్లు విమర్శించారు. దేశ రక్షణలో కేంద్రం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా పూర్తి మద్దతు ఉంటుందన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నాట్కోట్రస్ట్ చేస్తున్న సామాజిక, సేవా, అభివృద్ధి కార్యక్రమాలు అభినందనీయమని మంత్రి అన్నారు. నాట్కో ప్రతినిధి పీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, వైద్యం అందించాలనేది నాట్కో సంస్థల లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, నాయకులు దేవేందర్‌యాదవ్, జగన్, హరినాథ్‌రెడ్డి, దేవేందర్‌ముదిరాజ్, వేణుగోపాల్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, ఎంపీడీవో అరుంధతి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, పాఠశాల హెచ్‌ఎం అంగూర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామ: మేకగూడలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న శివసేనారెడ్డి

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి

చేవెళ్ల: కాంగ్రెస్‌పార్టీ వ్యవస్థాపక పునఃనిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ అధ్యక్షతన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి శివసేనారెడ్డితోపాటు జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇది పార్టీ ఇచ్చిన మంచి అవకాశంగా తీసుకోవాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలతో కలిసిపోయేందుకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కాగా, నియోజకవర్గంలో పార్టీలో విభేదాలు, సమస్యలను నాయకులు, కార్యకర్తలు సమావేశంలో బయట పెట్టారు. రెండు వర్గాల కారణంగా పార్టీ చేపట్టే కార్యక్రమాలను సరిగా చేయలేకపోతున్నామని, సమన్వయం చేసేవారు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన నేతలు విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర నాయకులు గౌరీసతీష్, జనార్దన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కరెంటు పోనివ్వం

- డిమాండ్ ఎంతున్నా విద్యుత్ సరఫరా
- లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించాం
- ఫీడర్లు, పీటీఆర్‌లు, డీటీఆర్‌ల కెపాసిటీ పెంచాం
- కొత్తగా మరిన్ని సబ్ స్టేషన్లు నిర్మించబోతున్నాం
- నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిని ఉపేక్షించం
- ‘సాక్షి’తో టీజీ ఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యా నాయక్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ‘ఐటీ సర్కిల్లో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. అధిక లోడు కారణంగా ఒత్తిడికి గురవుతున్న సబ్‌స్టేషన్లను గుర్తించాం. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 8 ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏకు పెంచాం. ఫీడర్లను అనుసంధానిచ్చాం. కొత్తగా అనేక డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో పాటు వాటి సామర్థ్యాన్ని పెంచాం.ఐటీ జోన్‌లో రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా కాపాలా కాస్తున్నాం’అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యా నాయక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. నమోదవుతున్న విద్యుత్ డిమాండ్, చేపట్టిన ప్రత్యామ్నాయ చర్యలను వివరించారు. ఆయన మాటల్లోనే..

విద్యుత్ గ్రోత్ రేట్ ఇక్కడే అధికం

2023 ఏప్రిల్‌తో పోలిస్తే 2024 ఏప్రిల్‌లో ఇతర జోన్లతో పోలిస్తే రంగారెడ్డి జోన్‌లోనే ఎక్కువ విద్యుత్ గ్రోత్‌రేటు నమోదైంది. మెట్రో జోన్‌లో 13.86 శాతం విద్యుత్ వృద్ధిరేటు నమోదు కాగా, మేడ్చల్ జోన్‌లో 16.31 శాతం నమోదైంది. రంగారెడ్డి జోన్‌లో ఏకంగా 17.77 శాతం నమోదైంది. గచ్చిబౌలి, ఇబ్రహీంబాగ్, కొండాపూర్ డివిజన్లలో 31.75 శాతం వృద్ధి రేటు కన్పించింది. మణికొండ, అయ్యప్ప సొసైటీ, కోకాపేట్, నార్సింగి, గచ్చిబౌలి, మణికొండ, సన్‌సిటీ, కిస్మత్‌పూర్, ఇబ్రహీంబాగ్, తుక్కుగూడ, శంషాబాద్‌లో అనూహ్య పెరుగుదల కన్పించింది. భవిష్యత్తులో వచ్చే ఒత్తిడిని తట్టుకునేలా సరఫరా వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 13, సైబర్ సిటీ సర్కిల్‌లో ఆరు, సరూర్‌నగర్ సర్కిల్‌లో ఐదు, వికారాబాద్‌లో పది చొప్పున కొత్త సబ్ స్టేషన్లు నిర్మించబోతున్నాం.

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా..

సైబర్‌సిటీ సర్కిల్‌లో ఒత్తిడికి గురవుతున్న 128 (11కేవీ సహా నాలుగు 33 కేవీ ఫీడర్లను పునరుద్ధరించాం. సబ్‌స్టేషన్లలోని 25 పీటీఆర్‌ల సామర్థ్యాన్ని పెంచాం. కొత్తగా మరో 232 డీటీఆర్‌లను ఏర్పాటు చేశాం. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 67(11 కేవీ), 09(33కేవీ) ఫీడర్లు సహా 24 పీటీఆర్‌ల సామర్థ్యం పెంచాం. ఇక్కడ కొత్తగా మరో 171 డీటీఆర్‌లను ఏర్పాటు చేశాం. సరూర్ నగర్ సర్కిల్ పరిధిలో 49(11కేవీ) సహా ఏడు 33 కేవీ ఫీడర్లతో పాటు 23 పీటీఆర్‌ల సామర్థ్యం పెంచాం. కొత్తగా మరో 309 డీటీఆర్‌లను ఏర్పాటు చేశాం. వికారాబాద్ సర్కిల్ పరిధిలో పది 11 కేవీ, ఒక 33 కేవీ లైన్లను అనుసంధానించాం. తొమ్మిది పీటీఆర్‌లతో పాటు మరో 234 డీటీఆర్‌లను ఏర్పాటు చేశాం.



డిమాండ్ ఎంతొచ్చినా తగ్గేదే లేదు

నగరానికి ఆనుకుని ఉన్న ఈ జిల్లాలో కొత్తగా అనేక నిర్మాణాలు వస్తున్నాయి. ఐటీ అనుబంధ పరిశ్రమలతో పాటు హోటళ్లు, ఇతర వాణిజ్య సంస్థలు ఏర్పడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా విద్యుత్ డిమాండ్ నమోదవుతోంది. ఇప్పటికే ఉన్న సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు కొత్తగా మరిన్ని సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. 2030లో రాబోయే డిమాండ్‌ను ఇప్పుడే అంచనా వేసుకుని ఆ మేరకు లైన్ల విస్తరణ, పీటీఆర్‌ల సామర్థ్యం పెంపు వంటి చర్యలు చేపట్టాం. అంచనాలకు మించి డిమాండ్ వచ్చినా సమర్థవంతంగా సరఫరా చేస్తాం. క్షేత్రస్థాయిలో కొంత మంది సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పాటు అడ్డదారులు తొక్కుతున్నట్లు తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. లైన్ల మంజూరు, మీటర్ల జారీలో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ సంస్థకు చెడ్డపేరు తెచ్చే వాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం. అలాంటి వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం.

ఆర్ఆర్‌జోన్‌లో ఈనెలలో విద్యుత్ డిమాండ్

తేదీ	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
01	1,591	39.02
02	1,828	39.28
03	1,548	37.17
04	1,397	35.54
05	1,597	38.15

గన్‌మెన్‌ను తోసేసిన కాంగ్రెస్ కార్యకర్తలు

- కిందపడిన అంగరక్షకుడు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్


తోపులాటలో కిందపడిన మంత్రి గన్‌మెన్

నందిగామ: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేశారు. నందిగామ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో నాట్కో ట్రస్టు ఆర్థిక సహకారంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన ఆయన పాఠశాల గేటు నుంచి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి నడుస్తున్నారు. ఈ క్రమంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొమ్ము కృష్ణ తమ అనుచరులతో మంత్రిని దగ్గరనుంచి అనుసరించే క్రమంలో గన్‌మెన్ కాంగ్రెస్ నాయకులతో పాటు, కొమ్ము కృష్ణను సైతం పక్కకు తోశాడు. దీంతో ఆగ్రహించిన కార్యకర్తలు గన్‌మెన్‌ను పక్కకు నెట్టేయడంతో పడిపోయాడు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు కృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇంతలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కల్పించుకొని వారిని సముదాయించాడు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై కొమ్ము కృష్ణను వివరణ కోరగా తాను గన్‌మెన్‌పై దాడి చేయలేదని ఆయనే నన్ను పక్కకు నెట్టి వేశారని తన తప్పేమీలేదని చెప్పారు.

భూ భారతిలోనైనా పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు అంజయ్య కుటుంబ సభ్యులు, నాయకులు

కడ్తాల్: కంప్యూటర్ ఆపరేటర్ చేసిన తప్పిదం కారణంగా తన భూమి.. ధరణి పోర్టల్ మరో వ్యక్తి పేరిట నమోదైందని ఓ రైతు ఆవేదన వ్యక్తంచేశాడు. కనీసం భూభారతిలో నైనా సమస్యను పరిష్కరించాలని కోరాడు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ ముంతాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కడ్తాల్‌లోని సర్వే నంబర్లు 72/ఇ, 846, 816,817,321/24లలో తనకు మొత్తం 2.29 ఎకరాల భూమి ఉందని, అరవై ఏళ్లుగా ఇందులో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాని తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్ తప్పిదం కారణంగా ఈ భూమి అన్మాస్‌పల్లికి చెందిన బాచిరెడ్డి రంగారెడ్డి పేరిట తప్పుగా నమోదైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు రాజేశ్, శివ, కుటుంబ సభ్యులు బాలరాజు నిరంజనమ్మ, కృష్ణ, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలో ఇరువర్గాల ఘర్షణ

- పలువురికి గాయాలు
- కేసు నమోదు


మీసాలతండాలో ఘర్షణలో తీవ్రంగా గాయపడిన వ్యక్తులు

యాచారం: మండల పరిధిలోని మీసాలతండాలో భూ తగాదా విషయమై రెండు కుటుంబాల మధ్య మంగళవారం సాయంత్రం తీవ్ర ఘర్షణ జరిగింది. ఓ వర్గానికి చెందిన కుటుంబం వారు కర్రలు, ఇనుప రాడ్లతో మరో వర్గంపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మీసాలతండా పరిధిలోని సర్వేనంబరు 44లో ఎకరా పట్టా భూమికి సంబంధించి నేనావత్ సోమ్లు, నేనావత్ కేవ్లనాయక్ వారసుల మధ్య కొన్నేళ్లుగా వివాదం సాగుతోంది. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం ఇరు కుటుంబాల వారు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో రాకేష్, పవన్ రాంజీకి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మొదట యాచారం ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరానికి తరలించారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

అడుగుకో గుంత!

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- అవస్థల్లో వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు


కంకర తేలి అధ్వానంగా మారిన కనకామిడి- వెంకటాపూర్ రోడ్డు


గుంతలమయంగా సురంగల్- శ్రీరాంనగర్ రోడ్డు

మొయినాబాద్: గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. పెద్ద గుంతలు పడి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మారి ఏడాదిన్నర కావస్తున్నా గ్రామీణ రహదారులు బాగుపడటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సురంగల్- శ్రీరాంనగర్ రోడ్డు, కనకమామిడి- వెంకటాపూర్, మొయినాబాద్- చిలుకూరు, పెద్దమంగళారం- చందానగర్, తోలుకట్ట- నక్కలపల్లి, ఎనికేపల్లి- బాకారం, వెంకటాపూర్- నక్కలపల్లి, రెడ్డిపల్లి- చిన్నమంగళారం రహదారులపై అడుగడుగునా గుంతలు పడ్డాయి. వీటికి మరమ్మతులు చేయకపోవడంతో ప్రస్తుతం నడవలేని పరిస్థితి నెలకొంది.

నిధులు మంజూరైనా..

మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని పలు రహదారుల అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరయ్యాయి. కానీ ఇంత వరకు మొదలు కాలేదు. పెద్దమంగళారం- చందానగర్, కనకమామిడి- వెంకటాపూర్, మొయినాబాద్- ముర్తూజగూడ, చిలుకూరు- మొయినాబాద్ రోడ్ల అభివృద్ధికి రెండేళ్ల క్రితమే నిధులు మంజూరయ్యాయి. అప్పట్లోనే శంకుస్థాపనలు సైతం చేశారు. కానీ కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టలేదు. ప్రస్తుతం పెద్దమంగళారం- చందానగర్‌రోడ్డు ఆర్‌అండ్‌బీ శాఖకు మారింది. నిధులు మంజూరైనా రహదారుల అభివృద్ధి పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. పదేళ్లుగా వీటిని పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. గతంలో మంజూరైన రోడ్లు బాగుపడకపోగా.. ప్రస్తుత ప్రభుత్వం కూడా వీటిపై దృష్టి పెట్టడంలేదు. దీంతో ప్రజలు రోడ్ల విషయంలో తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

వాహనాలు పాడవుతున్నాయి



మొయినాబాద్‌లో రోడ్లన్నీ గుంతలుగా మారాయి. ఐదు నిమిషాల్లో వెళ్లే దూరానికి అరగంటకు పైగా సమయం పడుతోంది. దీనికి తోడు వాహనాలు పాడవడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారులను బాగు చేయించాలి.

– శ్రీనివాస్‌చారి, సురంగల్, మొయినాబాద్

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే..



మండలంలోని చాలా గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. గతంలోనే కొన్నింటికి నిధులు మంజూరయ్యాయి. చిలుకూరు- మొయినాబాద్ రోడ్డు పనులను ఇటీవల మొదలు పెట్టిన కాంట్రాక్టర్ మళ్లీ ఆపేశారు. కనకమామిడి- వెంకటాపూర్ రోడ్డుకు నిధుల కొరత ఉందంటున్నారు. మిగిలిన రోడ్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ

ప్రాణం తీసిన ఈత సరదా

నీట మునిగి మృతి చెందిన తొమ్మిదేళ్ల బాలిక

బొంరాస్‌పేట: చిన్నారులతో కలిసి ఈతకు వెళ్లిన తొమ్మిదేళ్ల బాలిక నీట మునిగి మృతి చెందిది. ఈ హృదయ విదారక ఘటన మండల పరిధిలోని రేగడిమైలారం పటేల్‌చెరువు తండాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన బలిజ ప్రవీణ్, మమత పెద్ద కూతురు భవ్యశ్రీ(9) కొడంగల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి పూర్తి చేసుకుంది. మధ్యాహ్నం గ్రామంలోని పలువురు చిన్నారులు వేసవి విడిదిగా పటేల్ చెరువు వద్దకు వెళ్లారు. కొందరు చిన్నారులు నీట మునగడంతో తోటి వారు గమనించి వెంటనే బయటకు లాక్కొచ్చారు. భవ్యశ్రీ ఎక్కువ లోతుకు వెళ్లి నీట మునగడంతో చిన్నారులు అరుపులు కేకలు వేశారు. సమీపంలోని గొర్రెల కాపరులు గమనించి వెంటనే చెరువులోకి దిగి గల్లంతైన బాలికను వెతికి బయటకు తీశారు. అప్పటికే మృతి చెందడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

కారు అదుపుతప్పి ఆర్ఐకి గాయాలు


ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడుతున్న తహసీల్దార్ జగదీశ్వర్

కొందుర్గు: కారు అదుపు తప్పి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విధి నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం ముట్పూర్‌లో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుకు హాజరయ్యేందుకు జిల్లేడ్ చౌదరిగూడ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తన కారులో ఉమ్మెంత్యాల నుంచి ముట్పూర్ వెళ్తుండగా.. రేగడిచిల్కమర్రి సమీపంలో వాహనం అదుపు తప్పింది. పక్కనే ఉన్న బీరప్ప ఆలయానికి చెందిన బేస్మెంట్ గోడను ఢీకొట్టింది. బెలూన్స్ తెరుకోవడంతో శ్రీనివాస్‌రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జగదీశ్వర్, సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

కారు బోల్తా

బెలూన్స్ తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం


బోల్తా పడిన కారు

నందిగామ: అతివేగం కారణంగా ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన మండల పరిధిలోని బైపాస్ రోడ్డు భారత్ పెట్రోల్ పంప్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు నందిగామ శివారులోని భారత్ పెట్రోల్ పంపు సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారులోని బెలూన్స్ తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడని తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం శంషాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా గాయపడిన వ్యక్తి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన సంతోశ్‌గా తెలిసింది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు

జగద్గిరిగుట్ట: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నరసింహ తెల్పిన వివరాల ప్రకారం ఏలూరుకు చెందిన నరసింహారాజు, నాగేశ్వరరావు స్నేహితులు. వీరు ఐపీఎల్ మొదలైనప్పటి నుండి గాజుల రామారం, మహదేవపురంలో రూమ్ అద్దెకు తీసుకొని క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు బుధవారం వీరు ఉన్న ఇంటిపై దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. 2 కంప్యూటర్లు , 2 ల్యాప్‌టాప్‌లు, 4 ఫోన్‌లతో పాటు రూ.3.6 లక్షలు నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. కాగా నాగేశ్వరరావుపై 2019లో విజయవాడ పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు నమోదైనట్లు వారు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పనులు పరుగిడేలా..

హై సిటీ నిర్మాణాల కోసం పీఎంసీలు

- టెండర్లు పిలిచిన జీహెచ్ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్ట్ కింద చేపట్టనున్న ఫ్లై ఓవర్లు, తదితర నిర్మాణాల్ని వేగవంతంగా చేసేందుకు పర్యవేక్షణ తదితర పనుల కోసం ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీలు (పీఎంసీ) కావాల్సిందిగా జీహెచ్ఎంసీ కోరింది. పనులు నాణ్యతగా, త్వరితగతిన పూర్తయ్యేందుకు నిత్యం పర్యవేక్షణ కోసం పెద్ద ప్రాజెక్టులకు జీహెచ్ఎంసీ పీఎంసీల సేవల్ని వినియోగించుకుంటోంది. గతంలో ఎస్సార్‌డీపీ కింద చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, తదితర ప్రాజెక్టుల్లోనూ పీఎంసీల సేవల్ని వినియోగించుకుంది. పనుల్లో తేడాలొచ్చినా, డిజైన్లు, నాణ్యత, తదితర అంశాల్లోనూ పీఎంసీలు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఫ్లై ఓవర్లు.. అండర్ పాస్‌లు..

హై సిటీ కింద కేబీఆర్ పార్కు చుట్టూ పలు ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లతో పాటు ఖాజాగూడ జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్‌ల వద్ద ఫ్లై ఓవర్ల పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. పనులు ప్రారంభించే సమయానికి పీఎంసీలు కూడా సిద్ధంగా ఉండాల్సి ఉన్నందున జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం టెండర్లు ఆహ్వానించింది. ఆయా ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లతో పాటు సైబరాబాద్ సీపీ కార్యాలయం నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు 215 అడుగులతో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు, అంజయ్యనగర్ నుంచి రాంకీ టవర్స్ వరకు 150 అడుగులతో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనుల కోసం కూడా పీఎంసీలను ఆహ్వానించింది. కాంట్రాక్టర్ల డిజైన్లను పరిశీలించి ఇంజినీరింగ్ ప్రమాణాలకనుగుణంగా ఉన్నదీ లేనిదీ నిర్ధారించడంతో పాటు పనులు జరిగే సమయంలోనూ పనులు నాణ్యతగా జరుగుతున్నదీ లేనిదీ, వినియోగించే సామగ్రి తదితరమైనవి చూడాలి. పనులు వేగంగా పూర్తిచేసేందుకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో కొత్తగా అందుబాటులోకొచ్చిన సాంకేతిక విధానాలుంటే వాటిని అమలు చేసేందుకు కూడా అవసరమైన సలహాలివ్వవచ్చు.

నిర్మాణ వ్యయం తగ్గించేందుకు..

జీహెచ్ఎంసీలో ఎస్సార్‌డీపీ పనులతోనే ప్రీకాస్ట్, స్టీల్ బ్రిడ్జిలు మొదలు కావడం తెలిసిందే. ఇలాంటి వాటిని అమలు చేయడంలోనూ పీఎంసీలు ముఖ్య భూమిక వహిస్తాయి. పనులు వేగంగా పూర్తయ్యేందుకు, నిర్మాణ వ్యయం తగ్గించేందుకు కూడా తగిన సూచనలివ్వాలి. ఫ్లై ఓవర్లతోపాటు వాటిపై లైటింగ్, కింద డ్రైనేజీ సిస్టమ్, ల్యాండ్‌స్కేపింగ్‌లతోసహా ఇతరత్రా పనుల డిజైన్‌లను కూడా పరిశీలించాలి. ప్రజలకు సదుపాయవంతంగా ఉండేలా, సమస్యలకు ఆస్కారం లేకుండా వాటి డిజైన్లుండేలా చూడాలి. క్షేత్రస్థాయి పరిస్థితుల్ని బట్టి అవసరమైన సందర్భాల్లో ఫౌండేషన్లు, తదితరమైన వాటికి సంబంధించి రీడిజైన్ చేయాల్సి ఉంటుంది.పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలివ్వాల్సి ఉంటుంది. పీఎంసీలు లేనిదే పనులు జరగవు కాబట్టి వాటి సేవల కోసం టెండర్లు పిలిచింది.

దారి కబ్జా

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

మీర్‌పేట: దారిని కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాన్ని తొలగించాలని నందన వనం వాంబే కాలనీవాసులు మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. వాంబే కాలనీలో స్థానికంగా ఉండే ఓ వ్యక్తి 24 ఇళ్లకు సంబంధించి వెళ్లే 300 గజాల దారిని ఆక్రమించి ప్రహరీ, గదులు నిర్మిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఇంటి నిర్మాణంపై జీహెచ్ఎంసీ అధికారులకు చెప్పామని సీఐ పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: బండ్లగూడ మండలం కందికల్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో వెలిసిన ఆక్రమణలను హైడ్రా బుధవారం తొలగించింది. సర్వే నం.303, 306ల్లో ఉన్న 2500 గజా ల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ఇది అర్బన్ ల్యాండ్ సీలింగ్ కు సంబంధించిన భూమి కాగా సయ్యద్ బషీరుద్దీన్, సయ్యద్ అమీదుల్లా హుస్సేన్ కబ్జా చేశారు. ఈ భూమిని తన పేరు మీద రెగ్యులరైజ్ చేసుకునేందుకు చేసిన విఫల యత్నా లు చేశారు. అనుమతులు లేకుండా షెడ్లు, రూంలు నిర్మించారు. ఆ ప్రభుత్వ భూమి కబ్జా అవుతోందని, కాపాడాలని స్థానికుల నుంచి ప్రజావాణి ద్వారా హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈ అంశాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించా రు. హైకోర్టు సైతం ఈ అక్రమ కట్టడాలను తొలగించాలని రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో హైడ్రా అధికారులు బుధవారం అక్కడ నిర్మించిన నాలుగు ఆర్‌సీసీ రూమ్‌లు, రేకుల షెడ్లులో ఉన్న నాలుగు షాపుల్ని కూల్చివేశా రు. అది ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంలో కొందరు స్థానిక రాజకీ య నాయకులు, కబ్జా చేసిన వారి తరఫు వారు ఈ కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. స్థానిక పోలీసుల సహకారంతో హైడ్రా వారిని అక్కడ నుంచి పంపేసి కూల్చివేతలు కొనసాగించింది.

సలామ్.. హస్నాబాద్

దేశ రక్షణ అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది ఆర్మీనే. కుటుంబాలకు దూరంగా ఉంటూ భరతభూమికి వారు చేస్తున్న సేవ వెలకట్టలేనిది. రేయింబవళ్లు శత్రు మూకల బుల్లెట్లు, బాంబుల మోతల మధ్య నిత్యం పోరాటం చేసే సైనికులే మన ధైర్యం. ఆ సైన్యంలో దాదాపుగా వంద మందికి పైగా హస్నాబాద్ వాసులు విధులు నిర్వహిస్తున్నారు.

- గ్రామం నుంచి ఆర్మీలో వంద మందికి పైగా సైనికులు
- వేర్వేరు రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని యుద్ధభూమికి తరలింపు
- ఆనందంగా ఉందంటూ ఆత్మీయులకు ధైర్యం చెబుతున్న జవాన్లు


1971 యుద్ధ సమయంలో అధికారి హోదాలో ఇంతియాజ్ అలీ (వృత్తంలో)


జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న సైనికుడు రమేశ్

దుద్యాల్: యువత సరిహద్దులో సేవ చేసేలక్ష్యంతో ఆర్మీలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామం నుంచి వంద మందికి పైగా దేశ రక్షణలో సైనికులుగా చేరారు. ప్రతీ సెలక్షన్ నుంచి ఇద్దరి నుంచి ఐదుగురు వరకు సైన్యంలో చేరడం ఆనాయితీగా మారింది. 70 ఏళ్ల క్రితం ప్రారంభమైన చేరికలు నేటికీ కొనసాగుతూ దేశ సేవలో తరిస్తున్నారు. ప్రతీ ఏడాది పది మంది పదవీ విరమణ పొందుతుంటే మరో పది మంది సైన్యంలో చేరుతుంటారు. ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు చొప్పున సైన్యంలో విధులు నిర్వహిస్తున్న వారు వంద మందికి పైగా ఉన్నారు.


రక్తం ఉప్పొంగుతోంది

ప్రస్తుతం భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం ప్రారంభమైంది. దీంతో వివిధ రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన దాదాపు 50 మంది వరకు సైనికులను జమ్ముకశ్మీర్ ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. కొన్నేళ్లుగా సాధారణ విధులు నిర్వహించిన తమకు ప్రస్తుతం మధురానుభూతి కల్గుతోందని కుటుంబ సభ్యులతో అభిప్రాయాలను పంచుకుంటున్నారు. శత్రు దేశం పాకిస్తాన్‌తో యుద్ధం అంటే రక్తం ఉప్పొంగుతోందంటున్నారు. హైదరాబాద్, నాసిక్, బెంగళూర్, తమిళనాడు, ఉత్తర్ ప్రదేశ్ వంటి ప్రధాన నగరాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని యుద్ధ పరిసర ప్రాంతాలకు తరలించినట్లు అందులో హస్నాబాద్‌కు చెందిన వారు సైతం ఉన్నారని సైనికులు చెబుతున్నారు. ప్రాణభయం లేకుండా దేశసేవకు సిద్ధంగా ఉన్నామని.. ఉగ్రవాదులను అంతం చేయడానికి మంచి అవకాశం వచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కార్గిల్ యుద్ధంలో నేను సైతం

ఇంతియాజ్ అలీ 1971లో జరిగిన భారత్-పాకిస్తాన్ యుద్ధంలో పాల్గొన్నారు. ఈ యుద్ధ సమయంలో పాక్-బంగ్లా దేశాలు కొన్ని ప్రాంతాలు విడిపోయాయని ఆయన చెప్పారు. భారత్ నుంచి ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొనడం ఆత్మ సంతృప్తి నిచ్చిందన్నారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలోనూ పాలుపంచుకున్నట్లు గుర్తు చేశారు. ప్రస్తుత 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొనే అవకాశం హస్నాబాద్‌కు చెందిన సైనికులకు దక్కిందని ఆయన ఆనందం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.


గర్వంగా ఉంది



భారత్-పాక్ మధ్య జరుగుతున్న యుద్ధ విధుల్లో ఉన్నా. ప్రస్తుతం చైనా సరిహద్దులోని లడక్ ప్రాంతంలో భద్రత బలగాల్లో ఉన్నాను. ఇన్నాళ్ల విధుల కంటే ఇప్పుడే సంతృప్తిగా ఉంది. ప్రాణాలకు తెగించి ప్రత్యర్థిపై యుద్ధం చేయడమే లక్ష్యం. దేశసేవలో పాల్గొంటున్నందుకు గర్వంగా ఉంది.

– జి.ఆశప్ప, నాయక్ సుబేదార్

పిలుపు వస్తే పరుగెత్తుతాం



ప్రస్తుతం భారత్-మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. మన దేశం శత్రు మూకపై దాడులు ప్రారంభించింది. ఉగ్రవాదులను పూర్తిగా మట్టుబెట్టేందుకు భారత సైన్యం తలమునకలైంది. మాజీ సైనికులకు పిలుపువస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా. యుద్ధం చేయాలనే ఆసక్తితో ఉన్నాం.

– బసప్ప, మాజీ సైనికుడు, హస్నాబాద్